# కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

- గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలి
- ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు


బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

కోహీర్, మే 2: అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన వెంటనే డిసెంబర్ 9న అన్ని పథకాలను అమలు చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఆ రోజు నుంచి ఇప్పటివరకు ఎందుకు చేయలేదని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ప్రశ్నించారు. గురువారం జహీరాబాద్ మండలంలోని అల్గోల్, తుంకుంట, బూచినెల్లి గ్రామాల్లో జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ 2014కంటే ముందు కూడా తెలంగాణ ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రస్తుతం ఏ ఒక్క పథకాన్ని సరిగా అమలు చేయకుండా దేవుళ్లపై ఒట్టు వేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, నిరుద్యోగ భృతి రూ.4వేలు, మహిళలకు నెలనెలా రూ.2,500, రైతుభరోసా రూ.15వేలు, కౌలు రైతులకు రూ.12వేలు, ఫింఛన్లు రూ.4వేలు ఎవరికైనా ఇచ్చారా అని నిలదీశారు. కల్యాణలక్ష్మి చెక్కులే ఇవ్వడం లేదని, ఇక తులం బంగారం ఎప్పుడు ఇస్తారన్నారు. ఉద్యోగాల కోసం ఇంతవరకు ఒక్క కొత్త నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. కానీ ఇప్పటికే 30వేల ఉద్యోగాలు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌పై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ఓటుతో తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఒకరు మతం పేరుతో, మరొకరు రిజర్వేషన్ల పేరుతో రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్యమకారుడు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలన్నారు. తెలంగాణ ప్రజలు బాగు పడాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, గుండప్ప పెంటారెడ్డి, షేక్ ఫరీద్, మచ్చేందర్, మోహన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, రాజు, బస్వరాజ్, అమిత్‌కుమార్ పాల్గొన్నారు.

# తెలంగాణ కోసం పుట్టిన పార్టీ బీఆర్ఎస్

పటాన్‌చెరు ఎమ్మెల్యే
గూడెం మహిపాల్‌రెడ్డి


పటాన్‌చెరులో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి


అమీన్‌పూర్:బీఆర్ఎస్ నాయకులతో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు, మే 2: తెలంగాణ కోసం పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలో అల్విన్ కాలనీ, చైతన్యనగర్ కాలనీలలో లోక్ సభ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రచారాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో దశాబ్దకాలంలో పటాన్‌చెరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. రూ.9వేల కోట్లకు పైగా నిధులను నియోజకవర్గంలో ఖర్చు చేసి అభివృద్ధి చేశామన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను మరిచిపోయిందని, ఏఒక్క హామీని సరిగా అమలు చేయలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ఐఏఎస్ అధికారిగా రాణించారని, ఇప్పుడు మనకు ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారన్నారు. కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదదవ్, జడ్పీటీసీ సుప్రజావెంకట్‌రెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి, మాజీ ఎంపీపీ గాయత్రిపాండు, విజయ్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్ పాల్గొన్నారు.

**ప్రచారాన్ని ముమ్మరం చేయాలి**

అమీన్పూర్, మే 2: బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేయాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం ఉదయం అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి నివాసంలో మున్సిపల్ పరిధిలోని ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులతో సమావేశమయ్యారు. బూత్ స్థాయి సమావేశాలతో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ఉదయం, సాయంత్రం ఇంటింటి ప్రచారం చేయాలన్నారు. మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధిని ఓటర్లకు వివరించడంతోపాటు.. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను వివరించాలని సూచించారు. వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, కాటా రాజుగౌడ్ పాల్గొన్నారు.

# కంకర క్రషర్‌పై చర్యలు తీసుకోవాలి


హత్నూర తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న హత్నూర గ్రామస్తులు

హత్నూర, మే 2: మండల కేంద్రమైన హత్నూర శివారులోని గణపతి కంకర క్రషర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం తహసీల్ కార్యాలయం ఎదుట గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేండ్ల క్రితం ఏర్పాటుచేసిన కంకర క్రషర్ యాజమాన్యం అనుమతులకు మించి బండరాళ్లను తవ్వుతున్నారని ఆరోపించారు. బ్లాస్టింగులతో పంటపొలాలు దెబ్బతినడంతోపాటు హత్నూర, బ్రాహ్మనగూడ, నాగులదేవులపల్లి గ్రామాల్లో ఇండ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్న కంకర క్రషర్ క్వారీపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కిష్టయ్య, వీరస్వామిగౌడ్, గ్రామస్తులు నాగప్రభుగౌడ్, పెంటేశ్, నరేందర్, దుర్గేశ్వర్‌రెడ్డి, యాదగిరి, ప్రవీణ్, పెంటయ్య, శంకర్, శ్రీనివాస్, మధు, నవీన్, గోపాల్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ జాగో కన్వీనర్, మాజీ ఐఏఎస్ అకునూరి మురళి

# మతతత్వ బీజేపీని గద్దె దించాలి

తెలంగాణ జాగో కన్వీనర్,
మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి

న్యాల్‌కల్, మే 2: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని తెలంగాణ జాగో కన్వీనర్, మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో న్యాల్‌కల్‌లో తెలంగాణ జాగో, టీడీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఓటర్ల చైతన్య బస్సు యాత్రలో పాల్గొని మాట్లాడారు. ప్రజా సంక్షేమాన్ని, సుస్థిర అభివృద్ధిని గాలికి వదిలి అధికారం కోసం విద్వేషాలు రెచ్చగొడుతూ సమాజాన్ని విచ్ఛినం చేసే ప్రయాత్నాలు చేస్తున్న మోదీని గద్దె దించాలన్నారు. కార్పొరేట్ సంస్థలకు రూ.16 లక్షల కోట్ల అప్పులను రద్దు చేసి అదానీ, అంబానీలకు దోచిపెట్టారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని ప్రమాదకరంగా మార్చి దేవుళ్ల పేరిట ఓట్లను అడగడం సిగ్గు చేటన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు, నల్ల ధనాన్ని తీసుకువచ్చి పేదలకు పంచుతాని హామీ ఇచ్చిన మోదీ మరిచిపోయాడని ఎద్దేవా చేశారు. జనాభాలో మెజార్టీ స్థానంలో ఉన్న బీసీల కుల జనగణ చేపట్టకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో ప్రొపెసర్లు పి.లక్ష్మీనారాయణ, పద్మజ, డీబీఎఫ్ శంకర్, జనార్దన్, కర్ణం రవికుమార్, నిర్మాల, జేవీ చలపతిరావు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌ను గెలిపించుకుందాం


ఖాదిరాబాద్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

అందోల్ మాజీ ఎమ్మెల్యే
చంటి క్రాంతికిరణ్

వట్‌పల్లి, మే 2: అందరూ కలిసికట్టుగా పనిచేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను గెలిపించుకోవాలని కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ సూచించారు. గురువారం మండలంలోని ఖాదిరాబాద్ గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలోంచి వెళ్లిపోతున్న వారిగురించి ఆలోచించవద్దని, కష్టపడి పని చేసిన వారికి సరైన సమయంలో గుర్తింపు వస్తుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను, కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వీరారెడ్డి, వినోద్‌గౌడ్, నర్సింహులు, సుభాష్, తదితరులు ఉన్నారు.

## రోడ్‌షోను విజయవంతం చేయాలి

న్యాల్‌కల్, మే 2: మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో శుక్రవారం నిర్వహించనున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ రోడ్‌షోను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ కోరారు. గురువారం మండలంలోని డప్పూర్, న్యాల్‌కల్, ముంగి, అత్నూర్, మల్గి, చాల్కి తదితర గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాల్‌కల్ గ్రామంలో సాయంత్రం 7 గంటలకు ప్రధాన వీధుల గుండా రోడ్‌షో ఉంటుందని తెలిపారు. కార్యక్రమానికి జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, పార్లమెంట్ ఎన్నికల సమన్వయ కర్త దేవిప్రసాద్ తదితరులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

# ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



రేజింతల్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

న్యాల్‌కల్, మే 2: లోక్‌సభ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని రేజింతల్, గుంజోట్టి గ్రామాల్లో పోలీసుల కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ పట్టణ, రూరల్ సీఐలు రవి, నయీమొద్దీన్, ఎస్ఐలు రామానాయుడు, రాజేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓటేసిన వృద్ధులు, దివ్యాంగులు


బొల్లారంలో ఓ వృద్ధురాలి ఓటును సేకరిస్తున్న మున్సిపల్ మేనేజర్ నిర్మల, బీఎల్‌వోలు

బొల్లారం, మే 2: లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్‌బూత్ వరకు వెళ్లలేని 85 ఏండ్లు వయసు పైబడిన వారితోపాటు దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునే సౌకర్యాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. ఈ మేరకు గురువారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో పలువురి నుంచి ఇంటి వద్దే ఓటు హక్కును సేకరించారు. మున్సిపల్ కమిషనర్ మంగతాయారు ఆదేశాల మేరకు మున్సిపల్ మేనేజర్ నిర్మల ఆధ్వర్యంలో బీఎల్వోలు తొమ్మిది మంది దివ్యాంగులు, 85 మంది వృద్ధుల నుంచి ఓట్లను సేకరించారు. కార్యక్రమంలో బీఎల్వోలు వినోద్‌కుమార్, తులసి, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఓటేయండి


తెల్లాపూర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి

రామచంద్రాపురం, మే 2: ప్రజల మేలు కోసం పాటుపడే బీఆర్ఎస్ కారుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి అన్నారు. గురువారం తెల్లాపూర్‌లోని ఇన్ఫినిటీ, మైఫేర్ విలాస్‌లో ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి సతీమణి ప్రణీతరెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. పదేండ్ల కాలంలో తెల్లాపూర్ మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను కాలనీవాసులకు వివరిస్తూ బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా లలితాసోమిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాలుగు నెలల పాలన చూసిన తర్వాత ప్రజలందరూ కేసీఆర్‌ని గుర్తుచేసుకుంటున్నారని చెప్పారు. బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నదన్నారు. కేసీఆర్ హయాంలో నీటి సమస్యలు, కరెంట్ సమస్యలు అంటే తెల్వదని, ఇప్పుడు ఆ కష్టాలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీశైలం, నాయకులు ఉమేశ్, రాజిరెడ్డి, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మట్కా నిర్వహిస్తే కఠిన చర్యలు


నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

కోహీర్, మే2: మట్కా నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జహీరాబాద్ పట్టణ పోలీసులు గురువారం హెచ్చరించారు. జహీరాబాద్ పట్టణంలోని శ్రీరామ్ మహేళలో బుధవారం రాత్రి మట్కా నిర్వహిస్తున్న గుర్రం శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అతడి వద్ద నుంచి రూ.32,500, మట్కా చిట్టీలు 3, ఒక మట్కా బుక్, సెల్ ఫోన్ సీజ్ చేసినట్లు చెప్పారు. జిల్లాలో చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ఎస్పీ రూపేశ్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం


మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

వట్‌పల్లి, మే 2: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. పార్టీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేశ్‌షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల కేంద్రంలోగురువారం నిర్వహించిన అందోల్ నియోజకవర్గ విస్తృత స్థాయి యువత సమావేశానికి హాజరై మాట్లాడారు. వట్‌పల్లిని వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. రూ.11 కోట్లతో మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. జోగిపేటలో 55 కోట్లతో నర్సింగ్ కళాశాలను నిర్మిస్తున్నామని తెలిపారు.

# కాంగ్రెస్‌తోనే సంక్షేమం, సుస్థిరాభివృద్ధి

నాగల్‌గిద్ద, మే 2: అన్ని వర్గాల సంక్షేమం, సుస్థిరాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీ అందించాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేశ్‌షెట్కార్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పక్కా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాణిక్‌రావ్ పాటిల్, గుండేరావ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.


ఎండల తీవ్రతతో నిర్మానుష్యంగా మారిన అల్లాదుర్గం–మెటల్‌కుంట ప్రధాన రహదారి

# నిప్పులు కురిపిస్తున్న భానుడు

- బయటకు వచ్చేందుకు హడలిపోతున్న ప్రజలు
- నిర్మానుష్యంగా మారుతున్న ప్రధాన రోడ్లు

న్యాల్‌కల్, మే 2: సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఉదయం నుంచే తన ప్రతాపాన్ని చూపిస్తూ నిప్పులు కురిపిస్తున్నాడు. నాలుగైదు రోజులుగా మండలంలో 40 నుం చి 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో వేడికి తట్టుకోలేక జనం బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. మండలంలోని జహీరాబాద్–బీదర్, నారాయణఖేడ్, అల్లాదుర్గం – మెటల్‌కుంట ప్రధాన రోడ్డు మార్గాలన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసరం అనుకుంటేనే ప్రజలు ఉదయమే ప్రయాణిస్తున్నారు. ఇండ్లల్లో కూ డా ఉండలేని పరిస్థితి నెలకొంది. కొంతమం ది ఏసీలు, కూలర్లు పెట్టుకుంటుండగా, మరి కొంతమంది చెట్ల కింద సేదతీరుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే మేలో పరిస్థితి ఏంటని ప్రజలు బయందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందునప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.


ఎండల తీవ్రతతో నిర్మానుష్యంగా మారిన హద్నూర్ చౌరస్తా

## అంత్యక్రియలకు తక్షణసాయం

బొల్లారం, మే 2: మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్న బస్తీకి చెందిన రజియా భర్త వలి బుధవారం మృతి చెందారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ యువత నాయకుడు ప్రవీణ్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం రూ.5వేలు తక్షణసాయం అందజేశారు. మాజీ ఎంపీటీసీ కృష్ణంరాజు సైతం ఆర్థికసాయం అందించారు. స్థానికులు మోహిని, పాషా ఉన్నారు.

## పరిశ్రమ నుంచి బయటకు వెలువడిన స్టీమ్


సెల్ మార్ ల్యాబ్ పరిశ్రమ నుంచి బయటకు వస్తున్న స్టీమ్

జిన్నారం, మే 2: గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సెల్ మార్ ల్యాబ్ పరిశ్రమ నుంచి గురువారం మధ్యాహ్నం స్టీమ్ బయటకు రావడంతో కార్మికులు, ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. కొద్దిసేపు ఏం జరుగుతుందో ఎవరికీ అర్థం కాలేదు. పరిశ్రమ రోడ్డును స్టీమ్ కప్పేయడంతో కొద్దిసేపు ఎక్కడివాళ్లు అక్కడే ఆగిపోయారు. అసలే ఎండాకాలం కావడంతో పరిశ్రమ నుంచి వెలువడిన స్టీమ్‌ను చూసి కార్మికులు భయపడ్డారు.

# ప్రచారంలో బీఆర్ఎస్ జోరు


అందోల్: జోగిపేటలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


వట్‌పల్లి: సాయిపేటలో కరపత్రాలు అందజేస్తూ..


కోహీర్: జహీరాబాద్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

అందోల్, మే 2: జోగిపేటలో బీఆర్ఎస్ శ్రేణులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కలుస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. గురువారం మున్సిపల్‌లోని పలువార్డుల్లో మాజీ ఎంపీపీ రామాగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగభూషణం పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమకారుడు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకమై జహీరాబాద్ గడ్డపై మరోసారి గులాబీ జెండా ఎగురవేయాలన్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పే మాయమాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఈ ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చాపల వెంకటేశం, సంతోశ్, మహేశ్‌యాదవ్, బీర్ల శంకర్, సత్యం, శ్రీనివాస్, ఖాజాపాషా, గోరే, శంకర్‌రావు, ఇమ్రాన్, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**వట్‌పల్లిలో..**

వట్‌పల్లి, మే 2: మండలంలోని సాయిపేటలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని బీఆర్ఎస్ నాయకులు వీరారెడ్డి, మల్లేశం ఓటర్లను అభ్యర్థించారు. 13న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే నిండా మునిగినట్టేనన్నారు. తెలంగాణ అభివృద్ధి కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు.

**జహీరాబాద్‌లో..**

కోహీర్, మే 2: బీఆర్ఎస్ జహీరాబాద్ లోక్‌సభ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా గురువారం జహీరాబాద్ పట్టణంలోని 12వ వార్డులో పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉద్యమకారుడైన గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో షేక్ ఫరీద్, బండి మోహన్, బరూర్ దత్తాత్రి, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.